## విశ్వకర్మల పాదయాత్రను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశ్వకర్మ జేఏసీ నేతలు

మన్సూరాబాద్‌: విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో మా వాట వాకు దక్కాల్సిందేనని విశ్వకర్మ జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని శ్రీకాంత్‌చారి విగ్రహం వద్ద మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి విశ్వకర్మ జేఏసీ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, సంతోష్‌చారి, శ్రీరామోజు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన బీజేపీ నేతలు



వివేకానందనగర్‌కాలనీలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్‌: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక చెట్టు కార్యక్రమాన్ని బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు మంగారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ వివేకానందనగర్‌కాలనీలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు హాజరై మొక్కలు నాటారు.

## దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం



చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో రూ 1.50 కోట్ల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. నాయకులు సర్కిల్ ఏఈ సురేష్, జలమండలి మేనేజర్ రమ్యభారతి, నాయకులు రవీందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, దశరథగౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భరోసా కల్పించేందుకే విజిబుల్ పోలీసింగ్

హయత్‌నగర్: నేరాలను అదుపు చేసేందుకు, పోలీసు విధులపై అవగాహన కలిగించేందుకు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాచకొండ పోలీసు కమీషనర్ సుధీర్ బాబు అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో బాగంగా శుక్రవారం రాత్రి ఆయన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదర్ డెయిరీ సమీపంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ... అత్యవసర సేవల కోసం డయల్ 100ను, సైబర్ క్రైం నేరాలు, లోన్ యాప్ మోసాలు జరిగితే 1930 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని అన్నారు.

## 108 చీరల అలంకరణలో దుర్గాదేవి



మన్సూరాబాద్‌: శ్రావణ మాస శుక్రవారం పురస్కరించుకొని నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారు 108 చీరలతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, అర్చకులు బాల మురళిశర్మ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.39, వంకాయ రూ.23, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.21, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.40, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.15, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.28, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.23, కీర రూ.23, బీన్స్ రూ.75, క్యాప్సికమ్ రూ.50.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మహిళా భవనం



మహిళాభవనంలోని షెడ్డులో తాగిన మైకంలో తాగుబోతు



ప్రభుత్వ పాఠశాల, మహిళా భనం ఆవరణలో పేరుకుపోయిన చెత్తచెదారం

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోగల భూపేష్ గుప్తానగర్‌కాలనీలోని మహిళా భవనం మందుబాబులకు, గంజాయి బాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మహిళా భవనానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మందుబాబులను చూసి బెంబేలెత్తుతున్నారని.. ఇంతజరిగినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మహిళా భవనంలోని షెడ్డులో పట్టపగలే మందుతాగుతూ, గంజాయి తాగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. టీకేఆర్ కళాశాలకు వెళ్లే ప్రధానరహదారి పక్కన ప్రతినిత్యం వేలాది మంది తిరిగే ఈ ప్రాంతంలో పట్టపగలే అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో మదుబాబుల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్‌: బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు సీనియర్ బీజేపీ నేత సామ రంగారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్నా చౌక్ వద్ద శనివారం జరిగే నిరసన కార్యక్రమంలో బీజేపీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఓబీసీ వర్గాల సంక్షేమానికి అంకితబావంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, జయప్రకాష్, పంగ శ్రీకాంత్, క్రాంతిగౌడ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని మార్కెట్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి అన్నారు. మలక్‌పేట మార్కెట్‌లో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక టాయిలెట్ల నిర్మాణ పనులకు ఆమె ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు, వ్యాపారులకు మరింత సౌకర్యం కల్పించే ఉద్దేశంతో బిల్ట్ ఆన్ ట్యాక్స్ విధానంలో నూతన టాయిలెట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి మార్కెట్లను సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు మాదారం కృష్ణ, జగదీష్, మస్రత్ సుల్తానా, కిషన్ సింగ్, రామారావు, సత్యనారాయణ, సాయిరాం, శివాజీ, టీపీసీసీ కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, అధికారులు పుష్ప, మాధురి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్‌హక్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అడ్‌హక్ కమిటీ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మేయర్ శానిటేషన్ మెరుగుపరిచేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని చెప్పిన మాటలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. మేయర్ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందన్నారు. సీఎస్‌డీ సేవలు వినియోగించడం లేదని, ప్రైవేట్ సంస్థ రాంకీ సేవలు సరిగా లేకున్నా కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కే విజయకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను వాణిజ్య శాస్త్రం (1), గణితం (1) పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు 5 వ తేదీ నుంచి ఉదయం 10.30 నుంచి ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని నెట్, సెట్, పీహెచ్‌డీ గల వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 4 న సాయంత్రం 4 గంటల్లోపు బయోడేటాతో పాటు సర్టిఫికెట్లను జత చేసి ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందించాలని సూచించారు.

## రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 39, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 40, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 75, క్యారెట్ 40, దొండ 28-35, చిక్కుడు 55, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 50, ఆలుగడ్డ 23, దోస 15, సొరకాయ 13, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 28 ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## కాలనీలలో సదుపాయాలకు కృషి



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

లింగోజిగూడ: డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తామని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ తెలిపారు.డివిజన్ పరిధిలోని సాయినగర్ రోడ్డు నెం-3లో సిల్వర్ ప్లేట్-చాణిక్యపురి కమాన్ వరకు రూ.22.5లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శుక్రవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఉమేష్‌గౌడ్, నాయకులు వంగ శ్రీకాంత్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



దిల్‌సుఖ్‌నగర్: శ్రావణ మాసం రెండో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేశారు.

## కాలనీల్లో వృథాగా తాగునీరు

నల్లా వచ్చిన రోజు రహదారులపై వరదే..

సైదాబాద్: వాటర్‌వర్క్స్ అధికారులు పైప్‌లైన్‌ల ద్వారా రోజు విడిచి రోజు సరఫరా చేసే తాగునీరు రహదారులపై వృథాగా పారుతోంది. ముఖ్యంగా నల్లాలు వచ్చే రోజు కాలనీల్లోని అంతర్గత రహదారులపై తాగునీరు వరదలా పారుతోంది. సైదాబాద్ డివిజన్ పరిధిలోని సైదాబాద్ హౌజింగ్ బోర్డు కాలనీలో నల్లా వచ్చిన రోజు ఎక్కడా చూసినా నీటి వృథా దృశ్యాలే దర్శనమిస్తుంటాయి. పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా అయ్యే రెండో రోజు కూడా తాగునీరు వృథాగా వెళ్తుంది. వాటర్‌వర్క్స్ అధికారులు ఎప్పుడో ఒకసారి అవగాహన కార్యక్రమాల పేరిట తూతూమంత్రంగా కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీరు వృథా చేసే వారిపై వాటర్‌వర్క్స్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం కూడా తాగునీటి వృథా కారణమవుతుందని పలువరు అంటున్నారు. హౌజింగ్‌బోర్డ్ కాలనీలో తాగునీటి వృథా విషయమై వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశానని కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ తెలిపారు. తన ఫిర్యాదుకు స్పందిస్తూ వాటర్‌వర్క్స్ ఎండీ పరిశీలిస్తామని తమకు మెయిల్‌లో సందేశం ఇచ్చారని ఆయన చెప్పారు.



సైదాబాద్ హౌజింగ్ బోర్డ్ కాలనీలో రహదారులపై వృథాగా పారుతున్న తాగునీరు

## ఆలయంలో భక్తులకు వైద్య సేవలు



శ్రీవిజయదుర్గా మాత ఆలయంలో వైద్య శిబిరంలో పాల్గొన్న భక్తులు

సైదాబాద్: శ్రావణమాసం రెండో శుక్రవారం రోజు సైదాబాద్ డివిజన్ మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు వైద్య సేవలు కూడా అందించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు సంకల్పించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో చంపాపేట ఓనస్ ఆస్పత్రి వైద్య బృందంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వారు వైద్యశిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

## కాలనీలో సమస్యలను పరిష్కరించా

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: కాలనీలో నెలకొన్న సమస్యలను, ధీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించి, కాలనీని అభివృద్ధి పరుచానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వినాయకనగర్‌కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని వరదకాలువ పనులను నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కాలనీలవాసులు తమ ఇంటి ఎదుట నిర్మించుకున్న ర్యాంపులను స్వచ్ఛందగా తొలగించుకుని రోడ్డు వెడల్పుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు క్లైం శంకర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి,నాయకులు సాయిరామ్‌గౌడ్, సోమిరెడ్డి, కదారి యాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్లను పరిశీలించి చర్యలు చేపడుతాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్

మన్సూరాబాద్‌: అన్ని రకాల డాక్యుమెంట్లను లోతుగా పరిశీలించి చర్యలు చేపడతామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా చింతలకుంటలోని ఆగమయ్య నగర్ వద్ద జరుగుతున్న వరదకాలువ పనులను,వివేకానందనగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కమిషనర్ శుక్రవారం కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కాలనీవాసులు ఒకరిపై మరొకరు రోడ్డును ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. కాలనీ ఏర్పడినప్పుడు ఉన్న లేఅవుట్‌తో పాటు కాలనీలోని అందరికి లింక్ డాక్యుమెంట్లతో సహా అన్ని రకాల లే-అవుట్‌లను హైడ్రా కార్యాలయంలో అందజేయాలని కాలనీవాసులను కోరారు. హైడ్రా గతంలో నిర్మించిన నిర్మాణాల జోలికి వెళ్లదని తెలిపారు. కాలనీలో రోడ్లు మిస్సయ్యాయని, కొన్ని ప్లాట్లు ఓవర్‌లాప్స్ అయ్యాయని కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకచ్చారు. హైడ్రా డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ తిరుమల్, జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఏసీపీ విజయలక్ష్మి, హైడ్రా, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



కాలనీవాసులు ఫిర్యాదులను విన్నుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

## పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



మాట్లాడుతున్న జేసీ దేవేందర్‌రెడ్డి

సైదాబాద్: మహిళలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా తమ కుటుంబ సభ్యులను వ్యాధులకు దూరంగా ఉంచవచ్చని జీహెచ్‌ఎంసీ జేసీ దేవేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీసాయినగర్ బస్తీలో మహిళలకు, పారిశుద్ధ్య కార్మికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కాలనీలు బస్తీల్లో పర్యటించే ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందికి సహకరించాలని, ఇళ్ల పరిసరాల్లో వారితో ఫాగింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో యూసీడీ రత్నం, ఎస్.ప్రసాదరావు, శేషగిరిరావు, యాదయ్య, నరేందర్ పాల్గొన్నారు.

## రోగులకు చికిత్సతో పాటు మందులు సమకూర్చాలి

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల రాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ప్రజలకు సూచించారు. శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్‌లో బస్తీదవాఖాన, యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ నది పరివాహక ప్రాంతం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలో ఎక్కువ భాగం ఉంటుందని ప్రజలు అనారోగ్యానికి గురైె అవకాశముందని బస్తీ దవాఖానా, యూపీహెచ్‌సీ వైద్యుల బృందం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వెంటనే చికిత్సతో పాటు మందులు సమకూర్చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫివుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మనుచౌదరి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష




మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్, రెవెన్యూ, వైద్య, విద్యా శాఖలు, తదితర జిల్లా అధికారులతో ప్రభుత్వ భూములు పరిరక్షణ, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు తమ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలను అందించాలని ఆదేశించారు. 15వ ఆర్థిక కమిషన్ ద్వారా కేటాయించిన నిధులను వినియోగించుకొని జిల్లాలో ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. మురుగునీరు నిల్వకుండా, దోమల నివారణకు నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఫీవర్ సర్వేలు నిర్వహిస్తూ, ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సత్వరమే కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రైతులకు సబ్సిడీపై అందిస్తున్న ఎరువులు పక్కదారి పట్టకుండా, కొరత లేకుండా అందించేందుకు మండలస్థాయిలో అధికారులు ఫెర్టిలైజర్స్ షాపులను ప్రతి వారం తనిఖీ చేసి ఎరువుల నిల్వల స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ పథకం కింద అర్హులై ఉండి 60 ఏళ్లలోపు మృతి చెందిన ప్రతి ఒక్కరికీ రూ. 20 వేల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు.

### వన మహోత్సవం లక్ష్యాన్ని సాధించాలి

జిల్లాలో వన మహోత్సవం లక్ష్యాన్ని ఖచ్చితంగా సాధించాలని అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి. నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ భారతి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్లమ్స్ ఏరియాలను గుర్తించి అక్కడ చిన్న చిన్న ఇళ్లలో ఉండేవారికి ప్రభుత్వం జీ ప్లస్ 3,4 అంతస్తుల్లో పక్కా ఇళ్లు నిర్మించేందుకు తగిన స్థలాలను గుర్తించి నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యామ్ ప్రకాశ్, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.